

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 04-10-2025 | సంపుటి - 25 | సంచిక -140 | రూ : 4 | పేజీలు: 8

అమరావతిలో మేం భాగస్వాములమవుతాం...

## రూ.10,000 కోట్ల పెట్టుబడులకు మలేషియా ఆసక్తి



2లో

- మంత్రి నారాయణతో మలేషియా ప్రతినిధుల బృందం భేటీ
- విద్య, పర్యాటకం, హాస్పిటాలిటీ రంగాలపై ప్రధానంగా దృష్టి
- మెడికల్ యూనివర్సిటీ, ఫైవ్ స్టార్ హోటళ్ల ఏర్పాటుకు కంపెనీలు సిద్ధం
- రాబోయే ఐదేళ్లలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళిక
- ప్రపంచంలోని ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా అమరావతి



2లో

## ఉత్తరాంధ్ర వరద ప్రభావిత ప్రాంతాల్లో సమన్వయంతో పనిచేయండి

- ఉత్తరాంధ్ర వరద పరిస్థితిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష
- అధికారులకు కీలక ఆదేశాలు
- పారిశుద్ధ్య లోపం, తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని సూచన

దామోదర్ రెడ్డి భౌతికకాయానికి

## రేవంత్ రెడ్డి నివాళి



2లో

- రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దామోదర్ రెడ్డి మృతి
- జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ప్రజల సందర్శనార్థం భౌతికకాయం
- రేవంత్ రెడ్డితో పాటు పలువురు నాయకుల నివాళులు



2027 పుష్కరాలకు ముందే

## పోలవరం పూర్తి చేయాలి



2లో

- పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాలని అధికారులకు లక్ష్యం
- పనుల నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని స్పష్టం
- నవంబర్‌లో ఎర్త్-కం-రాక్‌ఫిల్ డ్యామ్ పనులు ప్రారంభించాలని ఆదేశం
- పోలవరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సూచన

## తెలంగాణలో మద్యం అమ్మకాల రికార్డు

రెండ్రోజుల్లో రూ. 419 కోట్ల అమ్మకాలు

- దసరా పండుగ వేళ రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు
- సెప్టెంబర్ 30న ఒక్కరోజే రూ. 333 కోట్ల మద్యం కొనుగోళ్లు
- గాంధీ జయంతి డ్రై డే కారణంగా ముందురోజే పోటెత్తిన జనం
- వివరాలు వెల్లడించిన తెలంగాణ ఎక్సైజ్ శాఖ



2లో

## ప్రపంచ దేశాలకు భారత్ దారిచూపుతోంది



2లో

- భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించిన బిల్ గేట్స్
- ఆవిష్కరణల రంగంలో ఇండియా ఓ గ్లోబల్ లీడర్ అని కితాబు
- 'వికసిత భారత్ 2047' లక్ష్యానికి మద్దతుగా ప్రకటన
- భారత పరిష్కారాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి మేలు చేస్తాయని వ్యాఖ్య
- అమెరికాలోని సియాటిల్‌లో గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న గేట్స్

హైవేలపై..

## క్యూఆర్ కోడ్ బోర్డులు

స్కాన్ చేస్తే పూర్తి సమాచారం మీ చేతిలో!

- జాతీయ రహదారులపై క్యూఆర్ కోడ్ బోర్డుల ఏర్పాటుకు ఎన్‌హెచ్ఏఐ నిర్ణయం
- స్కాన్ చేస్తే ప్రాజెక్ట్ వివరాలు, అత్యవసర నంబర్లు అందుబాటులోకి
- సమీపంలోని ఆసుపత్రులు, పెట్రోల్ బంకుల సమాచారం కూడా
- టోల్ ప్లాజాలు, రెస్ట్ ఏరియాల వద్ద ఈ బోర్డుల ఏర్పాటు



2లో

## తిరుపతిలో హై అలర్ట్..

రైల్వే స్టేషన్, బస్టాండులో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



2లో

- చెన్నైలో సీఎం స్టాలిన్, నటి త్రిష నివాసాలు బాంబు బెదిరింపు కాల్స్
- తిరుపతిలోనూ పేలుళ్లు జరుపుతామంటూ ఈమెయిల్
- అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం
- రంగంలోకి దిగిన బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు
- ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభ్యం కాలేదని వెల్లడి
- భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్న పోలీసులు



2లో

## నాంపల్లిలో అలయ్ బలయ్

హాజరైన వెంకయ్య, కోమటిరెడ్డి, నాగార్జున, సుజనా చౌదరి

- దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో అలయ్ బలయ్
- హాజరైన తెలంగాణ గవర్నర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు
- అందరం కలిసి ఉండాలనేదే అలయ్ బలయ్ ఉద్దేశమన్న వెంకయ్యనాయుడు

# తెలంగాణలో మద్యం అమ్మకాల రికార్డు.. రెండ్రోజుల్లో రూ. 419 కోట్ల అమ్మకాలు

హైదరాబాద్, అక్టోబర్ 03 : దసరా పండుగ, గాంధీ జయంతి ఒకేరోజు రావడంతో తెలంగాణలో మద్యం అమ్మకాలు సరికొత్త రికార్డులు సృష్టించాయి. పండుగకు ముందు కేవలం రెండు రోజుల్లోనే ఏకంగా రూ. 419 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. సాధారణ రోజులతో పోలిస్తే ఇది భారీ పెరుగుదల అని వారు తెలిపారు. ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, సెప్టెంబర్ 30న అత్యధికంగా రూ. 333 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఆ తర్వాత అక్టోబర్ 1వ తేదీన మరో రూ. 86 కోట్ల మద్యం అమ్మకాలు నమోదయ్యాయి. వాస్తవానికి సెప్టెంబర్ 26 నుంచే రాష్ట్రంలో మద్యం కొనుగోళ్లు రెట్టింపైనట్లు అధికారులు పేర్కొన్నారు. నిన్న గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం మద్యం దుకాణాలకు సెలవు ప్రకటించింది. అదే రోజు దసరా పండుగ కూడా ఉండటంతో, మందుబాబులు ఒకరోజు ముందుగానే పెద్ద ఎత్తున మద్యం కొనుగోలు చేశారు. ఈ కారణంగా అక్టోబర్ 1వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైన్ షాపులు, లిక్కర్ మార్ట్ల వద్ద విపరీతమైన రద్దీ కనిపించింది. పలుచోట్ల మద్యం కోసం జనం బారులు తీరిన దృశ్యాలు కనిపించాయి. పండుగ సీజన్‌తో పాటు డ్రై డే కూడా కలిసి రావడమే ఈ భారీ అమ్మకాలకు ప్రధాన కారణమని అధికారులు విశ్లేషిస్తున్నారు.

## దామోదర్ రెడ్డి భౌతికకాయానికి రేవంత్ రెడ్డి నివాళి

హైదరాబాద్, అక్టోబర్ 03 : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి భౌతికకాయానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం దామోదర్ రెడ్డి మృతి చెందారు. ఈరోజు ప్రజల సందర్శనార్థం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో భౌతికకాయాన్ని ఉంచారు. రేవంత్ రెడ్డితో పాటు పలువురు నాయకులు నివాళులర్పించారు.దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి పరామర్శించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి కూడా నివాళులర్పించారు. కోదండరెడ్డి మాట్లాడుతూ, దామోదర్ రెడ్డి, తాను ఒకేసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టామని అన్నారు. ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ఆయనకు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, కోలుకుని తిరిగి పార్టీలో క్రియాశీలకంగా ఉంటారని తాము భావించామని అన్నారు. ఆయన మృతి నల్గొండ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు అని అన్నారు.

## ప్రపంచ దేశాలకు భారత్ దారిచూపుతోంది: బిల్ గేట్స్

ఢిల్లీ, అక్టోబర్ 03 : మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, ప్రపంచ కుబేరుల్లో ఒకరైన బిల్ గేట్స్ భారత్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ఆవిష్కరణల రంగంలో భారత్ ఒక ప్రపంచ స్థాయి నాయకుడిగా నిలుస్తోందని, అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలకు మార్గదర్శకంగా ఉందని ఆయన కొనియాడారు. భారత పరిష్కారాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను మెరుగుపరిచే శక్తిని కలిగి ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికాలోని సియాటిల్‌లో భారత కాన్సులేట్ జనరల్, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ సంయుక్తంగా మహాత్మా గాంధీ 156వ జయంతి సందర్భంగా ఓ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి హాజరైన బిల్ గేట్స్ మాట్లాడుతూ... "ఈ రోజు భారత్ ఆవిష్కరణల్లో గ్లోబల్ లీడర్‌గా ఉంది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను కాపాడి, మెరుగుపరిచే పరిష్కారాలను అందిస్తోంది. 'వికసిత భారత్ 2047' లక్ష్య సాధనలో భారత్‌తో మా భాగస్వామ్యం కొనసాగుతుందని ఆశిస్తున్నాం" అని తెలిపారు. గాంధీజీ ఆశయాలైన సమానత్వం, గౌరవం తమ ఫౌండేషన్ పనికి పునాది వంటివని గేట్స్ పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భారతీయ సంస్కృతి, కళలు, సంప్రదాయ వంటకాలను ప్రదర్శించారు. వాషింగ్టన్, సియాటిల్ నగర ప్రభుత్వాల నుంచి సీనియర్ నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో 'ప్రస్తుత ప్రపంచంలో గాంధీ విలువల ప్రాముఖ్యత' అనే అంశంపై యూఎస్ గ్లోబల్ సెక్యూరిటీ ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షుడు జొనాథన్ గ్రానోఫ్ ప్రత్యేక ప్రసంగం చేశారు. అంతకుముందు, బెల్వ్యూ పబ్లిక్ లైబ్రరీ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి, సియాటిల్ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. వాషింగ్టన్ స్టేట్ సెనేటర్ వందనా స్లాటర్ పుష్పాంజలి ఘటించారు. సియాటిల్, బెల్వ్యూ నగరాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భారతఅమెరికన్ సమాజం పాల్గొంది. ఈ సందర్భంగా చిన్నారులు గాంధీజీకి ఇష్టమైన భజన గీతాలను ఆలపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని భారత కాన్సులేట్ కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది.

## పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేయాలి

ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు ముందే ప్రాజెక్టును పూర్తి చేయాలని స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. శుక్రవారం సచివాలయంలో జలవనరుల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులను కేంద్ర జల సంఘం, కేంద్ర జలవనరుల శాఖ నుంచి త్వరితగతిన సాధించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. సమావేశం సందర్భంగా, ప్రాజెక్టు పురోగతిని అధికారులు సీఎంకు వివరించారు. డయాఫ్రమ్ వాల్ పనులు గణనీయంగా పూర్తయ్యాయని, బట్రెస్ డ్యామ్ పనులు 100 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో, ప్రధాన డ్యామ్‌కు సంబంధించిన ఎర్త్ కం రాక్‌ఫిల్ పనులను ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభించి, 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. అదేవిధంగా, పోలవరం కుడి కాలువ టన్నెల్, అప్రోచ్ ఛానల్, హెడ్ రెగ్యులేటర్ పనులను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. 2026 జనవరి నాటికి పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను పూర్తి చేసి, అనకాపల్లి వరకు నీరందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. భూసేకరణ, పునరావాస కార్యక్రమాలను కూడా ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టును కేవలం సాగునీటి ప్రాజెక్టుగానే కాకుండా, ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రాజెక్టును జాతీయ రహదారితో కలుపుతూ ఒక ఐకానిక్ రోడ్డును నిర్మించాలని ప్రతిపాదించారు. రాజమహేంద్రవరాన్ని కేంద్రంగా చేసుకుని 'అఖండ గోదావరి' ప్రాజెక్టును కూడా చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రాజెక్టు వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)కి అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తిరుపతిలో హై అలర్ట్... రైల్వే స్టేషన్, బస్టాండులో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

తిరుమల, అక్టోబర్ 03 : తమిళనాడులో ప్రముఖులకు వచ్చిన బాంబు బెదిరింపుల సెగ తిరుపతిని తాకింది. చెన్నైలో ముఖ్యమంత్రి స్టాలిన్, నటి త్రిష ఇళ్లకు బెదిరింపు కాల్స్ రాగా... తిరుపతిలోనూ పేలుళ్లకు పాల్పడతామంటూ బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. ఈ నేపథ్యంలో, తిరుపతి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందు జాగ్రత్త చర్యగా నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ పరిణామం నగరంలో కాస్త ఉత్కంఠకు దారితీసింది. పోలీసు ప్రత్యేక బృందాలు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి తిరుపతి రైల్వే స్టేషన్, లింకు బస్ స్టాండ్, విష్ణునివాసం యాత్రికుల వసతి సముదాయం వంటి ఆరు కీలక ప్రాంతాల్లో సుమారు రెండు గంటల పాటు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి ప్రతి అంగుళాన్ని జల్లెడ పట్టారు. ప్రయాణికుల లగేజీని, అనుమానాస్పదంగా ఉన్న వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ప్రమాదకరమైన వస్తువులు గానీ, అనుమానాస్పద కార్యకలాపాలు గానీ గుర్తించలేదని పోలీసు వర్గాలు వెల్లడించాయి. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, నగరంలో భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేశామని అధికారులు తెలిపారు. శ్రీవారి దర్శనానికి దేశం నలుమూలల నుంచి వచ్చే యాత్రికులకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు.

## నాంపల్లిలో అలయ్ బలయ్.. హాజరైన వెంకయ్య, కోమటిరెడ్డి, నాగార్జున, సుజనా చౌదరి

హైదరాబాద్, అక్టోబర్ 03 : నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ ముగిసిన మరుసటి రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తెలంగాణ ఉద్యమం సమయంలో రాజకీయ నాయకుల మధ్య ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో దత్తాత్రేయ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈరోజు అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరైన అతిథులకు దత్తాత్రేయ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సుప్రీంకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీజేపీ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, సినీ నటులు నాగార్జున, బ్రహ్మానందం, ఏపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి, సీపీఐ నేత నారాయణ, తెలంగాణ జన సమితి నేత ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత వి. హనుమంత రావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, వేష భాషలు వేరైనా మనమంతా భారతీయులమనే భావనతో ముందుకు సాగుతున్నామని అన్నారు. అందరం ఐక్యంగా ఉండాలనే సదుద్దేశంతో అలయ్ బలయ్ కార్యక్రమం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. దత్తాత్రేయ గత ఇరవై సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. కొందరు కులం, మతం, వర్గం, జాతి పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారి ప్రయత్నాలు విఫలం కావడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు.

## ఉత్తరాంధ్ర వరద ప్రభావిత ప్రాంతాల్లో సమన్వయంతో పనిచేయండి

అమరావతి, అక్టోబర్ 03 : ఉత్తరాంధ్ర జిల్లాలను భారీ వర్షాలు, వరదలు ముంచెత్తుతున్న నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా, సురక్షిత మంచినీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రక్షిత మంచినీటి సరఫరా (ఆర్. డబ్ల్యూ.ఎస్.) శాఖల ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఉత్తరాంధ్రలో తుపాను ప్రభావంతో నెలకొన్న పరిస్థితులను అధికారులు ఆయనకు వివరించారు. ఒడిశా నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో వంశధార, నాగావళి నదులు ఉప్పొంగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా శ్రీకాకుళంలోని గొట్టా బ్యారేజీతో పాటు, వంశధార ప్రాజెక్టులోకి అంచనాలకు మించి వరద నీరు వచ్చి చేరుతోందని అధికారులు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమాచారం అందుకున్న పవన్, సహాయక చర్యలపై పలు కీలక సూచనలు చేశారు. "వరద ప్రభావిత ప్రాంతాల్లోని గ్రామాల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్. శాఖలు సమన్వయంతో పనిచేస్తూ సహాయక చర్యల్లో పాలుపంచుకోవాలి" అని ఆయన నిర్దేశించారు. వరద తగ్గిన తర్వాత పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా ఉంటాయని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అవసరమైతే సమీప జిల్లాల నుంచి పారిశుద్ధ్య సిబ్బందిని తరలించి, పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత ఆర్.డబ్ల్యూ.ఎస్. అధికారులపై ఉందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో క్లోరిన్ కలిపిన సురక్షిత తాగునీటిని అందించాలని ఆదేశించారు. నీరు కలుషితం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే ముంపునకు గురయ్యే గ్రామాల్లోని ప్రజలను జిల్లా యంత్రాంగం సురక్షిత ప్రాంతాలకు తరలించిందని అధికారులు సమావేశంలో వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న చర్యలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు తన కార్యాలయానికి నివేదికలు పంపాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

## హైవేలపై క్యూఆర్ కోడ్ బోర్డులు... స్కాన్ చేస్తే పూర్తి సమాచారం మీ చేతిలో!

ఢిల్లీ, అక్టోబర్ 03 : జాతీయ రహదారులపై ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై హైవేల వెంట క్యూఆర్ కోడ్లతో కూడిన సమాచార బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఈ క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేయడం ద్వారా ప్రయాణికులు రహదారికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని, అత్యవసర సేవలను సులభంగా పొందవచ్చు. ఈ క్యూఆర్ కోడ్ ద్వారా జాతీయ రహదారి నంబర్, ప్రాజెక్ట్ పొడవు, నిర్మాణ, నిర్వహణ కాలం వంటి వివరాలు తెలుసుకోవచ్చు. వీటితో పాటు హైవే పెట్రోలింగ్, టోల్ మేనేజర్, ప్రాజెక్ట్ మేనేజర్ వంటి అధికారుల ఫోన్ నంబర్లు, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ 1033 కూడా అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా, సమీపంలోని ఆసుపత్రులు, పెట్రోల్ పంపులు, టాయిలెట్లు, పోలీస్ స్టేషన్లు, రెస్టారెంట్లు, టోల్ ప్లాజాకు ఉన్న దూరం, ట్రక్కుల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు, పంక్చర్ షాపులు, వాహన సర్వీస్ స్టేషన్లు, ఈఛార్జింగ్ స్టేషన్ల వివరాలను కూడా ఈ కోడ్ ద్వారా పొందవచ్చని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వివరించింది. ప్రయాణికులకు సులభంగా కనిపించేలా ఈ బోర్డులను టోల్ ప్లాజాలు, రెస్ట్ ఏరియాలు, రహదారి ప్రారంభ, ముగింపు పాయింట్ల వద్ద ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ విధానం రహదారి భద్రతను పెంచడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని అందిస్తుందని, జాతీయ రహదారులపై అవగాహన కల్పిస్తుందని పేర్కొన్నారు. మరోవైపు, ఎన్‌హెచ్ఏఐ తన ఆస్తుల మానిటైజేషన్ ద్వారా 2026 ఆర్థిక సంవత్సరంలో రూ. 35,000 కోట్ల నుంచి రూ. 40,000 కోట్ల వరకు ఆదాయం ఆర్జించే అవకాశం ఉందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా (ICRA) ఒక నివేదికలో అంచనా వేసింది. ఇది 2025 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన రూ. 24,399 కోట్లతో పోలిస్తే గణనీయమైన పెరుగుదల అని, బడ్జెట్ లక్ష్యమైన రూ. 30,000 కోట్లను కూడా అధిగమిస్తుందని తెలిపింది.

## ఆటో డ్రైవర్ ఘరానా మోసం.. వృద్ధుడి ఫోన్ కాజేసి.. బ్యాంకు ఖాతా ఖాళీ

హైదరాబాద్: ఓ ఆటో డ్రైవర్.. వృద్ధ ప్రయాణికుడిని మభ్యపెట్టి సెల్‌ఫోన్ దొంగిలించాడు. మరో ఇద్దరితో కలిసి అతడి బ్యాంకు ఖాతాలో డబ్బును కొల్లగొట్టాడు. హైదరాబాద్‌కు చెందిన 68 ఏళ్ల వృద్ధుడు ఉప్పల్ నుంచి ఆటోలో ప్రయాణించాడు. ఆటో దిగే సమయంలో డిజిటల్ పేమెంట్ చేయాలని ఆటో డ్రైవర్ కోరాడు. వృద్ధుడు అతను కోరినట్టే డబ్బు చెల్లించాడు. అదే ఆటోలో ప్రయాణిస్తున్న బాలానగర్ వాసి మహ్మద్ మోహినుద్దీన్, మహ్మద్ సయ్యద్ సల్మాన్ వృద్ధుడిని మాటల్లో పెట్టగా.. ఆటో డ్రైవర్ బాధితుడి ఫోన్ అపహరించాడు. తన ఫోన్ పోయినట్టు మరుసటి రోజు గుర్తించిన బాధితుడు.. అందులో ఉన్న సిమ్ బ్లాక్ చేయించాడు. అనంతరం తన బ్యాంకు ఖాతా పరిశీలించగా.. రూ. 1.95లక్షలు మాయమైనట్లు తెలుసుకొని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## అమరావతిలో మేం భాగస్వాములమవుతాం... రూ.10,000 కోట్ల పెట్టుబడులకు మలేషియా ఆసక్తి

అమరావతి, అక్టోబర్ 03 :ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో పెట్టుబడులు పెట్టేందుకు మలేషియా కంపెనీలు భారీ ఆసక్తిని ప్రదర్శించాయి. రాబోయే ఐదేళ్లలో సుమారు రూ. 6,000 కోట్ల నుంచి రూ. 10,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించాయి. ప్రధానంగా విద్య, పర్యాటకం, వాణిజ్యం, రియల్ ఎస్టేట్ వంటి కీలక రంగాల్లో ఈ పెట్టుబడులు ఉండనున్నాయి. శుక్రవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణతో మలేషియా ప్రతినిధుల బృందం సమావేశమైంది. ఈ బృందంలో మలేషియా సెలంగోర్ రాష్ట్ర మంత్రి పప్పరాయుడు వెరమన్, క్లాంగ్ ఎంపీ వి. గణపతిరావు, మలేషియాఆంధ్రా బిజినెస్ ఛాంబర్ ప్రతినిధులు, పలు ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు ఉన్నారు. అక్టోబర్ 1 నుంచి రాష్ట్రంలో పర్యటిస్తున్న ఈ బృందం, మంత్రి నారాయణతో కలిసి రాజధాని ప్రాంతంలో పర్యటించి, పనుల పురోగతిని పరిశీలించింది. అమరావతి అభివృద్ధిలో తాము భాగస్వాములం అవుతామని మంత్రి పప్పరాయుడు ఈ సందర్భంగా తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ ప్రాజెక్టుల వివరాలను మంత్రి నారాయణకు వివరించారు. ఇందులో భాగంగా సైబర్‌జయా యూనివర్సిటీ అమరావతిలో ఒక మెడికల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడానికి, ప్రముఖ బెర్జయ గ్రూప్ ఫైవ్ స్టార్ హోటళ్లను నిర్మించడానికి సంసిద్ధత వ్యక్తం చేశాయి. ముఖ్యంగా మలేషియాలోని తెలుగు సంతతికి చెందిన పలువురు వ్యాపారవేత్తలు ఈ ప్రాజెక్టులపై ఆసక్తి చూపడం విశేషం. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మలేషియా ప్రతినిధులకు అమరావతి నిర్మాణ పనుల గురించి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో అమరావతిని ఒక ప్రణాళిక ప్రకారం నిర్మిస్తున్నామని, ప్రపంచంలోని ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాజధానిలో ఇప్పటికే రూ. 51,000 కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఏడాదిన్నరలో 360 కిలోమీటర్ల ప్రధాన రహదారులు, రెండేళ్లలో 1,500 కిలోమీటర్ల లేఅవుట్ రోడ్లు, వచ్చే ఏడాది మార్చి నాటికి ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల కోసం 4,000 గృహాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. గత మూడు నెలలుగా వర్షాల కారణంగా పనులకు కొంత ఆటంకం కలిగిందని, రానున్న రోజుల్లో పనులు వేగవంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# తెలంగాణ జాగృతి భద్రాద్రి జిల్లా అధ్యక్షుడిగా డి.వీరన్న ఎన్నిక



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జాగృతి నూతన అధ్యక్షుడిగా డి.వీరన్న నియమిస్తూ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కొత్తగూడెం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. భద్రాద్రి జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు కవితకు కృతజ్ఞతలు తెలిపారు. భద్రాద్రి జిల్లాలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న భద్రాద్రి జిల్లా అభివృద్ధిలో వెనుకబడే ఉందన్నారు. ఆంధ్రాలో కలిపిన 5గ్రామలను పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపేవరకు పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ఇల్లందు నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై కవిత సారథ్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. భద్రాద్రి రాముడి మాన్యాలను కాపాడాలని డిమాండ్ చేశారు. త్వరలో భద్రాద్రి జిల్లా పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాగృతి ఆటో విభాగం జిల్లా అధ్యక్షుడు రాంబాబు, ఇల్లందు నియోజకవర్గ ఇన్చార్జ్ మాళోత్ రాజేందర్ నాయక్, విద్యార్థి విభాగం జిల్లా నాయకులు సురేష్, అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు సునీత, ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆదినారాయణ, సుగుణ, విజయ, ప్రవీణ్, సత్యవతి, ఆటో యూనియన్ నాయకులు ముజాహిద్, దేశి ప్రసాద్, రాంబాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేటలో ఘనంగా విజయదశమి వేడుకలు...

**- శ్రీ జోగినాథ ఆలయంలో వేలాది భక్తుల పూజలు**




అందోలు, ప్రజాస్ఫూర్తి: జోగిపేట పట్టణంలో దసరా పండగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆనవాయితీ ప్రకారం తుపాకుల వంశీకులు ఆయుధాలను పెట్టి వేద పురోహితుల చేతుల మీదుగా పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీ రాజా రాజేశ్వరి దేవాలయం వద్ద జమ్మి చెట్టుకు షమీ పూజ నిర్వహించారు. అనంతరం అక్కడి నుండి మధ్యరంగం మీదుగా ఆయుధాలను చేత పట్టుకొని గౌనిచౌరస్తా, పోచమ్మగుడి, హనుమాన్ టెంపుల్, జోగినాథ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జోడు లింగాల స్వామి శ్రీ జోగినాథ ఆలయంలో ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట పుర ప్రముఖులు రాజకీయ నాయకులు యువకులు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో జెండా చేతబూని ఊరేగింపు నిర్వహించారు. పండగ సందర్భంగా వేలాది సంఖ్యలో భక్తులు ఆలయంలో పూజలు నిర్వహించారు. దర్శనం కోసం భక్తులు బారులు తీరి నిలబడ్డారు.

*** 17వ వార్డులో దసరా కానులను పంపిణీ చేసిన చిట్టిబాబు**

దసరా పండగను పురస్కరించుకొని జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులోని ప్రజలకు మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు ఆధ్వర్యంలో ఇంటింటికి దసరా కానుకలను అందజేసి శుభాకాంక్షలను తెలియజేసారు. గత ఆరు సంవత్సరాలుగా ఏ పండగ వచ్చినా వార్డు ప్రజలకు కానుకలను అందజేయడం, ముస్లీం పండగలకు ఆయా కుటుంబాలకు నిత్యవసర సరుకులను అందజేయడం ఆనవాయితీగా మారింది. ప్రజలు చిట్టిబాబుకు కృతజ్ఞతలు తెలియజేసారు.

## ప్రముఖుల జయంతి సందర్భంగా మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలిపిన ప్రకృతి ప్రేమికులు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జాతిపిత మహాత్మా గాంధీ, భారత మాజీ ప్రధాని లాల్ బహద్దూర్ శాస్త్రి జయంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణం రామవరంలోని శ్రీ సీతారామ హనుమాన్ శివాలయం ప్రాంగణంలో ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు కె.ఎన్. రాజశేఖర్ (మొక్కల రాజశేఖర్), ప్రకృతి హరిత దీక్షకులు నైనిక రజువా కలిసి గులాబి, సింధూరం, మందార మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సిపిఐ జిల్లా కార్యదర్శి, జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.సాబీర్ పాషా, మాజీ కౌన్సిలర్ భర్త పుట్టినరోజు సందర్భంగా కూడా మొక్కలు నాటి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కె.ఎన్. రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములై, ఏక్ పెడ్ మాకే నామ్ స్ఫూర్తితో అమ్మ పేరు మీద కనీసం ఒక్క మొక్క అయినా నాటాలి అని పిలుపునిచ్చారు. హరితదీక్షకురాలు నైనిక రజువా మాట్లాడుతూ ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, అందుకే ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి స్టీల్ బాటిల్స్, గ్లాసులు ఉపయోగించాలని సూచించారు.



## పండగలు ఐకమత్యానికి వేదికగా నిలవాలి కూనంనేని

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పండగలు ఐకమత్యానికి వేదికగా నిలవాలని, అనాదిగా వస్తున్న ఆచారాలను గౌరవిస్తూ ఐకమత్యంతో జరుపుకోవాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని పలు ఏరియాలలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను ఎమ్మెల్యే కూనంనేని ముఖ్య అతిథిగా హాజరై సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాదిగా వస్తున్న ఆచారాలను గౌరవిస్తూ పండుగలు, ఉత్సవాలు ఐకమత్యంతో జరుపుకొని మానవ సంబంధాలను మెరుగుపర్చాలని అన్నారు. ఉత్సవాల్లో పేద వర్గాలను భాగస్వామ్యం చేసి వారిలో సంతోషాన్ని నింపాలని కోరారు. ప్రజాస్వామ్య భారతదేశంలో కులమతాలకు అతీతంగా సోదరభావంతో పండుగలు జరుపుకోవడం మంచి పరిణామమని అన్నారు. ప్రజలు భక్తి మార్గాన్ని ఎంచుకోవడం వల్ల రాగద్వేషాలకు దూరంగా ఉంటారని, తద్వారా సమాజంలో శాంతి నెలకొంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జములయ్య, వాసిరెడ్డి మురళి, ఎస్.కె.ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, మునిగడప వెంకన్న, రమణమూర్తి,ఖయ్యూం, కమల్, మధు, తూముల శీను, మండలరాజు, పాటి మోహన్, మాజీ కౌన్సిలర్లు యూసుఫ్, ధర్మరాజు, మునిగడప పద్మ, భూక్య శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, బి.సత్యనారాయణ చారి, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా 'విజయదశమి' ఉత్సవాలు

*** శమీ పూజలతో ముగిసిన దసరా**

*** గంగమ్మ ఒడికి దుర్గమ్మ**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: తొమ్మిదిరోజులపాటు విశేష పూజలు అందుకున్న శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. విజయదశమి రోజు అమ్మవారిని భక్తులు దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో భక్తులు అమ్మవారికి వివిధ రకాల పూజలు నిర్వహించారు. ప్రతిరోజు ఒక అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, పాల్వంచ పెద్దమ్మగుడి, ఇల్లందులోని కోట మైసమ్మ ఆలయం ఇలా పలు ఆలయాలు విజయదశమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలోని రామవరంలోగల శ్రీ సీతారామ హనుమాన్ శివాలయం ప్రాంగణంలో ఆర్సిసి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు విశేషంగా నిర్వహించారు. గురువారం శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా ఉత్తర భారతదేశంకు చెందిన భక్తులు ప్రత్యేకంగా అలంకరించిన కలశాలతో ఊరేగింపులు నిర్వహించారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను ఊరేగింపు నిర్వహించిన అనంతరం భద్రాచలంలోని గోదావరి నది వద్దకు తీసుకువచ్చి నిమజ్జనం చేసి అమ్మవారికి వీడ్కోలు పలికారు. ఊరేగింపులో భక్తులు అమ్మవారి పాటలకు డ్యాన్స్‌లు చేస్తూ సందడిగా గడిపారు. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం పట్టణం రైటర్‌బస్తీ, రామవరం, లక్ష్మీదేవిపల్లి వంటి ప్రాంతాల్లో ప్రత్యేకంగా శమీ పూజలు నిర్వహించి రావణ సంహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల భారీ బాణాసంచాను కాల్చారు. చివరిగా రావణ సంహారం చేయడంతో విజయదశమి ముగిసింది. శరన్నవరాత్రుల సందర్భంగా ఆధ్యాత్మికశోభ సంతరించుకోవడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఘనంగా ఆయుధ పూజ



మేడిపల్లి , (ప్రజాస్ఫూర్తి) : విజయదశమి పర్వదినం సందర్భంగా మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిపల్లి సిఐ ఆర్. గోవిందా రెడ్డి మాట్లాడుతూ విజయదశమి అంటే చెడుపై మంచి విజయం సాధించడం అని అదే విధంగా సమాజంలో ప్రజలు కూడా వారి యొక్క చెడు సావాసుల ను వదిలి విజయం సాధించాలన్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని కోరుకుంటూ సిబ్బంది అందరూ కూడా వారు కోరుకున్న కోరికలు నెరవేరాలని ఆ దుర్గామాత ఆశీస్సులు అందరిపై చల్లగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఎస్సైలు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : జాతి పిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీ నగర్ లో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళులర్పించారు. ఈ కార్య క్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు జల్దా రాఘవులు, ఖాజా మియా, ఎల్లయ్య, లక్ష్మీనాధ్, శ్రీనివాస్ గౌడ్, జలీల్, వాజీద్, నర్సింహ, హనుమయ్య, శ్రీనివాస్, నీలగిరి, పాషా భాయ్, సత్యనారాయణ, తిమ్మయ్య, నవీన్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా దుర్గాదేవి నిమజ్జనోత్సవం

**- ముగిసిన నవరాత్రి ఉత్సవాలు**



అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామంలో దుర్గా భవాని దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన దేవీ నవరాత్రి ఉత్సవాల ముగిసాయి. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులు దుర్గామాతకు తొమ్మిది రోజుల వైభవంగా పూజలు నిర్వహించారు. చివరి రోజు దుర్గామాతను ప్రత్యేకంగా అలంకరించి వాహనంలో ఉయ్యాలలో అమ్మవారిని కూర్చోబెట్టి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కోలాటాలు, నృత్యాలతో శోభాయాత్ర నిర్వహించారు. చివరి రోజు పురోహితులు ఆనంద్ శర్మ ఉత్సవ సభ్యులకు కలశం నీళ్లతో ఆశీర్వచనం అందజేసి, ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం అమ్మవారి శోభాయాత్ర ప్రారంభమైంది. నవరాత్రులు పూజలు అందుకున్న అమ్మవారికి వివిధ రూపాల అవతారాలలో అలంకరించిన చీరెలను వేలంలో భక్తులు దక్కించుకున్నారు. అమ్మవారి ఊరేగింపు శోభయాత్రలో చిన్నలు, పెద్దలు, మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. డిజే సౌండ్ చెప్పుల్లో మధ్య చిన్నారుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఊరేగింపులో దారి పొడవున మహిళా భక్తులు మంగళారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం సత్తా చాటాలి

*** సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం సత్తా చాటాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ పిలుపునిచ్చారు.స్థానిక మంచికంటి భవన్లో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఎం బలంగా ఉన్న స్థానాల్లో పోటీ చేస్తుందని తెలిపారు.పార్టీ విధానం ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఎన్నికలు సాధనంగా ఉపయోగించుకోవాలని అన్నారు.స్థానిక ఎన్నికలలో గ్రామాల అభివృద్ధికి అంకితమై పని చేస్తున్న సిపిఎం కు ఓటు వేసే విధంగా ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాజకీయ విధానానికి లోబడి ఎన్నికల ఎత్తుగడలు ఉండాలని అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీని ఓడించే విధంగా రాజకీయ కృషి ఉండాలని అన్నారు.బలమైన స్థానాలు అన్నింటిలో సిపిఎం పోటీ చేస్తుందని,ప్రతి మండలంలో ప్రాతినిధ్యం ఉంటుందని తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ




సభ్యులు ఎ జె రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, ఎం బి నర్సారెడ్డి, కారం పుల్లయ్య, కే బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, ఎస్ ఏ నబీ, స్వామి, వంశీ, రమేష్, మోరంపూడి శ్రీనివాస్, చిలకమ్మ, గంగ, నరేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు .

# జై దుర్గా భవానీ యూత్ అసోసియేషన్ దేవి నవరాత్రి ఉత్సవాలు

ప్రజాస్ఫూర్తి , కాప్రా : ఉప్పల్ నియోజకవర్గ చర్లపల్లి డివిజన్, కుషాయిగూడ పరిధిలోని ఎంఆర్ఆర్ కాలనీలో నిర్వహించిన జై దుర్గా భవానీ యూత్ అసోసియేషన్ దేవి నవరాత్రి ఉత్సవాలకు దసరా పండుగ రోజు శ్రీ రాజరాజేశ్వరి దేవి రూపంలో దర్శనం ఇచ్చిన దుర్గామాత . జై దుర్గా భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో



రిషి చేతుల మీదుగా లక్కీ డ్రా తీయడం జరిగింది. లక్కీ డ్రా లో మొదట విజేతగా క్యాసని లతా మాధురి ఎలక్ట్రానిక్ స్కూటర్ విజేతగా గెలుపొందారు. రెండో విజేతగా మనీష్ మొబైల్ ఫోన్ గెలుపొందారు. యూత్ ఆర్గనైజర్ శకత్ విజయ్ కుమార్ చేతుల మీదగా విజేతలకు బహుమతులు అందజేశారు. మాట్లాడుతూ అమ్మవారు అందరికీ సుఖ సంతోషాలతో ఆశీర్వాదం ఇవ్వాలని శ్రీ రాజరాజేశ్వరి దేవిని వేడుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ ఆర్గనైజర్ శకత్ విజయ్ కుమార్ మరియు కమిటీ సభ్యులు రాజశేఖర్ రెడ్డి, ఎస్. రాహుల్, యశ్వంత్, నాగేందర్, ఎస్. అరుణ్, కిషోర్, బాల, కే. ప్రసాద్, లింగం నాయక్,సంజయ్, దినేష్. భవాని దీక్ష మాలదారులు, అధిక సంఖ్యలో ప్రత్యేక అతిథులు పాల్గొన్నారు.

## తెలంగాణ డిజిపి బి. శివధర్ రెడ్డి కి దసరా పండుగ శుభాకాంక్షలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ డిజిపి గా పదవి బాధ్యతలు చేపట్టిన బి. శివధర్ రెడ్డి ని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మూసా పేట డివిజన్ మాజీ అధ్యక్షుడు చున్ను పాషా ఆధ్వర్యంలో పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్ప గుచ్చం అందజేసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## రాజధాని అమరావతిలో మలేసియా బృందం పర్యటన



అమరావతి: మలేసియా ప్రజాప్రతినిధుల బృందం రాజధాని అమరావతిలో పర్యటించింది. రాజధానిలోని నిర్మాణాల గురించి వారికి... మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ భార్గవ్ తేజ వివరించారు. సీడ్ యాక్సెస్ రహదారి పక్కనే నిర్మిస్తున్న సీఆర్డీఏ నూతన కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ సముదాయాల వివరాలను మలేసియా బృందానికి అధికారులు తెలిపారు. రెండున్నరేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రపంచంలో టాప్ 5 రాజధానుల్లో అమరావతిని ఒకటిగా రూపుదిద్దుతామని స్పష్టంచేశారు. అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు మలేసియాకు చెందిన పలు ప్రైవేటు సంస్థలు ఆసక్తి కనబరిచినట్లు మంత్రి తెలిపారు. రాబోయే 5 ఏళ్లలో రూ.6వేల కోట్ల నుంచి రూ.10వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేలా పలు ప్రాజెక్టులను మంత్రి నారాయణకు మలేసియా ప్రతినిధులు వివరించారు.



## అర్చకులకు జమ్మి మొక్కలు అందజేసిన ప్రకృతి ప్రేమికులు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:శ్రీ దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల వద్ద అర్చకులకు ప్రకృతి ప్రేమికులు జమ్మి మొక్కలను అందజేశారు. గురువారం విజయదశమి పర్వదినం సందర్భంగా జమ్మి మొక్కను పూజించే సంప్రదాయం కొనసాగుతుండగా, ఈ సందర్భంగా ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ప్రకృతి దీక్ష వ్యవస్థాపకులు కేఎన్ రాజశేఖర్ (మొక్కల రాజశేఖర్) ఆధ్వర్యంలో ప్రకృతి హరిత దీక్ష సభ్యులు నైనిక రజువా, పరూల్, అఫాన్ జైది తదితరులు పాల్గొన్నారు. అర్చకులకు జమ్మి మొక్కలను అందజేసి, విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ జమ్మి మొక్కకు ప్రత్యేకత ఉందని, ఇది విజయదశమి పర్వదినంలో పూజించదగిన పవిత్ర వృక్షం అని చెప్పారు.



ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి తప్పనిసరిగా మొక్కలు నాటాలి అని తెలిపారు. ఈ కార్యక్రమం పట్ల అర్చకులు ఆనందం వ్యక్తం చేసి, ఆశీర్వాదాలు అందజేశారు.



## విశాఖలో 80 ప్రాంతాల్లో కూలిన చెట్లు తొలగించాం: జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం: నగరంలో ఈదురు గాలులు, వర్షాలకు రోడ్లపై పడిన చెట్లను విశాఖ నగరపాలక సంస్థ సిబ్బంది తొలగిస్తున్నారు. ఈదురుగాలుల ప్రభావంతో నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు సహా చెట్లు కూలిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం జీవీఎంసీ, విద్యుత్, విపత్తు నిర్వహణ సిబ్బంది చెట్లను తొలగించే చర్యలు చేపట్టారు. దాదాపు 80 ప్రాంతాల్లో 150 చెట్లను తొలగించినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ వెల్లడించారు. సహాయ కార్యక్రమాలు కొనసాగుతాయని కమిషనర్ తెలిపారు.

**విజయనగరం జిల్లాలో..**

ఉమ్మడి విజయనగరం జిల్లాలో వర్ష ప్రభావానికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చీపురుపల్లి మండలంలో వర్షాలకు జనజీవనం స్తంభించింది. రోడ్లపై చెట్లు పడి రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్ సరఫరా నిలిచింది. చీపురుపల్లి సుభద్రాపురం రహదారిపై వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. మెరకముడిదాం మండలం కొట్టకరంలో నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. గుర్ల మండలం గవిడిపేట వద్ద రోడ్డుపై చెట్టుపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తెర్లాం మండలం లోచర్ల, తమ్మయపాలెంలో విద్యుత్ సరఫరా నిలిచింది. దత్తిరాజేరు మండలం భూపాలరాజపురంలో 6 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దత్తిలో మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం కలిగింది. రోడ్డుపై పడిన చెట్లు, విద్యుత్ స్తంభాలను తొలగించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. పార్వతీపురం మన్యం జిల్లా నర్సిపురంలో ఇంటి గోడ కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. పార్వతీపురం వెంకంపేట మార్గంలో రోడ్డుపై చెట్టు పడి రవాణాకు అంతరాయం కలిగింది. సీతానగరం మండలం అంటిపేట సమీపంలోనూ, గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేటలో రోడ్డుపై చెట్టు విరిగిపడింది. రోడ్లపై పడిన చెట్టును తొలగించి రాకపోకలను పోలీసులు పునరుద్ధరించారు. పార్వతీపురం మండలం గంగాపురం, కవిటిభద్రలో విద్యుత్ స్తంభాలు, చెట్టు విరిగిపడ్డాయి. వీరఘట్టం మండలం కంబర, కంబరవలస, శ్రీహరిపురం, మొదటికెళ్ల, చిట్టపుడివలస.. కురుపాం మండలం పూతిక వలస, సీతంపేటలో అరటిపంటకు తీవ్ర నష్టం జరిగింది. మన్యం జిల్లాలో నేడు అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలకు సెలవు ప్రకటించారు. గాలులు, భారీ వర్షాల సమయంలో ప్రజలు బయటకు రావద్దని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## నిజాంపేటలో ఘనంగా విజయ దశమి వేడుకలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : విజయ దశమి పర్వదినం సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ గ్రామపంచాయతీ వద్ద రామ్ పంతులుచే జమ్మి చెట్టు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో నిజాంపేట్ పెద్దలు కొలన్ నరసింహారెడ్డి,కొలన్ శ్రీనివాస్ రెడ్డి ,మేకల వెంకటేష్ లు పాల్గొని మన దేశ త్రివర్ణ పతాకం పతాకం ఎగరవేసి దేశభక్తిని చాటి అనంతరం జమ్మి చెట్టును ఎత్తుకొని కాలినడకతో నిజాంపేట్ లో వెలసినటువంటి శ్రీ మల్లన్న ఆలయం వద్దకు చేరుకొని జమ్మి చెట్టు పూజా కార్యక్రమం చేసి నిజాంపేట్ పెద్దలందరూ అలై బలై చేసుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో కొలన్ భద్రారెడ్డి,నగేష్ చారి, జనార్ధన్ రెడ్డి, రాజమోహన్ రెడ్డి, కుమార్ యాదవ్, సురేష్ యాదవ్, మాణిక్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, బొర్రా అశోక్, బర్రా చందు, ఏ జగదీష్ యాదవ్, కొలన్ లక్ష్మారెడ్డి, జగన్ యాదవ్, సాయి, బైండ్ల నాగేష్, సత్తిరెడ్డి, శ్రీశైలం యాదవ్, ప్రేమ్ కుమార్,కొలన్ మహిపాల్, గిరీష్, మాధవ రెడ్డి, నర్సింగ్ రావు, మేకల బాలకృష్ణ, నిజాంపేట్ గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి గ్రామంలో ఘనంగా విజయ దశమి వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : విజయ దశమి పర్వదినం సందర్భంగా కూకట్ పల్లి గ్రామంలో గల రామాలయం దేవాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ విజయదశమి వేడుకలలో శాసనమండలి సభ్యులు కురుమయ్య గారి నవీన్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రావణ దహన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.

## దేవరగట్టు బన్ని ఉత్సవంలో చెలరేగిన హింస..
## ఇద్దరు మృతి, 100 మందికి గాయాలు



కర్నూలు జిల్లా దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి బన్ని జైత్రయాత్రలో విషాదం చోటు చేసుకుంది. అర్ధరాత్రి స్వామి, అమ్మవారి వివాహం జరిగిన తరవాత ఊరేగింపు నిర్వహించారు. ఈ క్రమంలో విగ్రహాలను తీసుకెళ్లే సమయంలో రెండు వర్గాలు తలపడ్డాయి. ఒకవర్గంపై మరో వర్గం కర్రలతో దాడి చేసుకోగా ఇద్దరు భక్తులు మరణించారు. మరో 100 మంది గాయపడ్డారు. గాయపడినవారిలో ఐదుగురికి తీవ్రగాయాలు అయినట్టు తెలుస్తోంది. గాయపడినవారిని చికిత్స కోసం అదోని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉంటే దసరా రోజున దేవరగట్టులో ప్రతిఏడాది స్వామివారి కల్యాణం జరుగుతుంది. ఈ ఉత్సవంలో కర్రలతో సమరానికి దిగడం సంప్రదాయం. ఊరేగింపులో దేవతామూర్తులను దక్కించుకోవడానికి తలపడతుంటారు. కొత్తపేట, నెరణికి తండా గ్రామాల భక్తులు ఒక వర్గంగా, అరికెర, సళువాయి, ఎల్లార్తి సహా ఏడు గ్రామాల భక్తులు మరో వర్గంగా విడిపోయి తలపడతారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రతిఏడాది ఇక్కడ వందల మంది గాయపడుతుంటారు. కానీ సంప్రదాయం ఇంకా కొనసాగుతూనే ఉంది.

## తిరుపతిలో రెచ్చిపోతున్న కబ్జాదారులు..
## ఖాళీ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు



తిరుపతిలో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ఖాళీ స్థలాలు కనిపిస్తే గద్దల్లా వాలిపోతున్నారు. దర్జాగా కోట్ల విలువైన స్థలాలు యదేచ్ఛగా ఆక్రమించేసుకుంటున్నారు. రోడ్డు స్థలం అయినా సరే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. చోట, మోటా అనే తేడా లేకుండా విలువైన స్థలాలను కబ్జా చేస్తున్నారు. ఓ పార్టీకి చెందిన నేత తిరుచానూరు సర్కిల్ వద్ద నేషనల్ హై సర్వీసు రోడ్డు, పంచాయతి రోడ్డు సహా ఫ్రీ లెఫ్ట్ స్థలాన్ని కబ్జా చేశారు. అక్కడ భారీ హోటల్ నిర్మాణానికి పునాదులు వేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌కు స్లాబు కూడా పోస్తున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఫ్రీ లెఫ్ట్ స్థలాన్ని కబ్జా చేయడం, అందుకు సహకరిస్తున్న నేతలపైనా ప్రజలు మండిపడుతున్నారు. అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# అడ్వొకేట్ రక్షణ చట్టం చాలా ముఖ్యమైంది: కేంద్రమంత్రి అర్జున్ రామ్‌మేఘ్వాల్

హైదరాబాద్: ప్రజల ఆలోచనలకు అనుగుణంగా చట్టాలు తేవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచన చేస్తున్నారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌మేఘ్వాల్ అన్నారు. అడ్వొకేట్ రక్షణ చట్టం చాలా ముఖ్యమైందని, దేశంలో లాయర్లు, డాక్టర్లకు చాలా డిమాండ్ ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో జరిగిన.. పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్జున్ రామ్‌మేఘ్వాల్ మాట్లాడుతూ.. ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల వద్ద ఇన్సూరెన్స్ తీసుకున్నా.. పరిహారం సరిగా ఇవ్వడంలేదని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి కేసులు కూడా సుప్రీంకోర్టులో ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ ఇమేజ్ పెంచే ప్రయత్నం చేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సూచించారు. కేంద్రం పాలసీలకు అనుగుణంగా న్యాయస్థానాల్లో మనం ఎలా వాదిస్తామనేది కీలకం అన్నారు. రానున్న మూడేళ్లు చాల కీలకమైందని, అందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ స్టాండ్ బలంగా వినిపించేందుకు




ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలి అంటే అందరం కలసి కట్టుగా పని చేయాలన్నారు. అర్జున్ రామ్‌మేఘ్వాల్ ఐఏఎస్‌గా ఉన్నప్పటికీ రాజీనామా చేసి కేంద్రమంత్రి స్థాయికి ఎదిగారన్నారు. ఎంపీ లక్ష్మణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తదితరులు సమవేశంలో పాల్గొన్నారు.

## 'ఐబొమ్మ' హెచ్చరికలు ఎవరికి?

సినిమా పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ తెలంగాణ పోలీసులకు హెచ్చరికలు జారీ చేసి, గోప్యమైన ఫోన్ నంబర్లను లీక్ చేస్తామంటూ బెదిరించిందన్న వార్తలను తెలంగాణ ప్రభుత్వం ఖండించింది. దీనిపై వచ్చిన ప్రచారం అవాస్తవమని తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్‌విభాగం స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టింది. ''పలు మీడియా కథనాలు, సోషల్ మీడియాలో ప్రసారమైన పోస్టుల ప్రకారం.. సినిమా పైరసీ సైట్ iBomma తెలంగాణ పోలీసులకు హెచ్చరికలు చేసి, గోప్యమైన ఫోన్ నంబర్లను లీక్ చేస్తామని బెదిరించినట్లు పేర్కొన్నాయి. ఇలా ప్రసారం అవుతున్న స్క్రీన్‌షాట్‌లు 2023 నాటివి. అవి పోలీసులను ఉద్దేశించినవి కాదు.. తెలుగు సినిమా పరిశ్రమకు సంబంధించినవి. తెలంగాణ




పోలీసులకు ఎలాంటి బెదిరింపులు రాలేదని తెలియజేస్తున్నాం. ప్రజలు సోషల్ మీడియాలో పోస్టు చేసే, షేర్ చేసే విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని మనవి'' అని పేర్కొంది.

## జీటో కనెక్ట్-2025 ఎగ్జిబిషన్..
# ప్రారంభించిన కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

హైదరాబాద్: విద్య, వ్యాపార రంగాల్లో జైన సమాజం పాత్రను కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రశంసించారు. హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జీటో) కనెక్ట్ 2025 ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రకృతి వనరులు సంక్షోభంలో ఉన్న ఈ రోజుల్లో జైన తత్వం నియంత్రణ మార్గాన్ని చూపిస్తుందన్నారు. ఆధ్యాత్మికత, వ్యాపార రంగం, విద్య, సంస్కృతి కలిసి జైన సమాజం గరిష్ఠ స్థాయిలో ఎదగడానికి ఈ జీటో కనెక్ట్ వేదికగా మారిందన్నారు. ప్రపంచానికి ప్రేరణగా వాణిజ్యం, సాంస్కృతిక భావం, ఆధ్యాత్మికత, సమాజ సేవ లక్ష్యాలను కలిపి రూపొందించిన ఒక సమగ్ర ఈవెంట్‌గా ఆయన అభివర్ణించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. విలువలతో కూడిన



వృద్ధికి చిరునామాగా తెలంగాణ దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మారిందన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అత్యంత అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు. ఒకప్పుడు పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాలిచ్చే రాయితీలు, ప్రోత్సాహకాలను చూసే పెట్టుబడులు పెట్టేవారన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇప్పుడు వారి ఆలోచన తీరు కూడా మారిందన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, యోగా గురువు రాందేవ్ బాబా హాజరయ్యారు.



## ఫలక్‌నుమా ఆర్వోబీని
# ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: నగరంలో మరో వంతెన అందుబాటులోకి వచ్చింది. ఫలక్‌నుమా ఆర్వోబీని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. రూ. 52.03 కోట్లతో ఫలక్‌నుమా ఆర్వోబీని ప్రభుత్వం నిర్మించింది. కార్యక్రమంలో ఎంపీ అసదుద్దీన్, మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడుకు నైనీ బొగ్గు.. సింగరేణి అంగీకారం

సింగరేణి సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి తమిళనాడు పవర్ జనరేషన్ కార్పొరేషన్‌కు బొగ్గును సరఫరా చేసేందుకు సర్వం సిద్ధమైంది. ఈ బ్లాక్ నుంచి ఏటా 2.88 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరాకు తమిళనాడు జెన్ కోతో సింగరేణి సంస్థ మరో 10 రోజుల్లో ఇంధన సరఫరా ఒప్పందం చేసుకోనుంది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో తమిళనాడు పవర్ జనరేషన్ కార్పొరేషన్ ఎండీ ఎం.గోవిందరావు... సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌ను కలిసి చర్చలు జరిపారు. తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా ఉడింగిడిలో ఉన్న 1200 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ కోసం ఏటా 2.88 మిలియన్ టన్నుల జీ 11 బొగ్గు అవసరముందని తమిళనాడు జెన్ కో



ఎండీ ఎం.గోవిందరావు పేర్కొన్నారు. సింగరేణి నుంచి ఈ బొగ్గును సరఫరా చేయాల్సిందిగా కోరారు. దీనిపై సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ స్పందిస్తూ... ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమైన నేపథ్యంలో రైలు, జల మార్గంలో సరఫరా చేసేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేయాల్సిందిగా నైనీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే సమయంలో తమిళనాడు జెన్ కోతో మరో 10 రోజుల్లో ఇంధన సరఫరా ఒప్పందం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిందిగా బొగ్గు రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. సింగరేణితో తమిళనాడు జెన్ కోకు ఉన్న దీర్ఘ కాలిక బంధాన్ని మరింత బలపరిచేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్, తమిళనాడు జెన్ కో ఎండీ ఎం.గోవిందరావు పేర్కొన్నారు.

# ఈ విధ్వంసాన్ని వెంటనే ఆపాలి



సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ విధ్వంసానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో విమర్శించారు. సెప్టెంబర్ నెలలో జీఎస్టీ వసూళ్ల వృద్ధి రేటులో తెలంగాణ దేశంలోనే అట్టడుగున ఉండటం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక విధ్వంసానికి సంబంధించిన మరో స్పష్టమైన సూచిక ఇదేనని తెలిపారు. సరిగ్గా రెండేళ్ల క్రితం, కేసీఆర్ పాలనలో రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయం నుండి ఐటీ వరకూ అన్ని రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి దన్ను ఇవ్వడంతో ఆర్థిక వ్యవస్థ పరుగులు తీసి, రికార్డులు తిరగరాసిందని తెలిపారు. కానీ.. నేడు కాంగ్రెస్ పాలనలో పండుగ వచ్చినా, పబ్బం వచ్చినా అన్ని రంగాలూ నేలచూపులే చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం నుంచి రియల్ ఎస్టేట్ వరకూ అన్ని రంగాల్లోనూ దైన్యమే తాండవిస్తున్నదని మండిపడ్డారు. అరాచకత్వం, అవినీతి, అనుభవలేమి కలగలసిన రేవంత్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి గురవుతున్నదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధ్వంసాన్ని వెంటనే ఆపడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లోని రక్షణశాఖ భూములు రాష్ట్రానికి ఇవ్వండి..

### రాజ్‌నాథ్‌ను కోరిన మంత్రి పొన్నం

హైదరాబాద్: నగరంలోని రక్షణశాఖ భూములను రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉపయోగించేందుకు అనుమతివ్వాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని హైదరాబాద్‌లో రాజ్‌నాథ్‌సింగ్‌కు మంత్రి పొన్నం అందజేశారు. వినతి పత్రాన్ని పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటారని పొన్నం ఆశాభావం వ్యక్తం చేశారు. జంట నగరాల్లో ప్రజలకు కీలకమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో రక్షణ శాఖ భూములు ఎంతో ఉపయోగపడతాయని, కంటోన్మెంట్ నుంచి తెలంగాణ ప్రభుత్వానికి యూజర్ ఛార్జీల కింద వచ్చే దాదాపు రూ.వెయ్యి కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని రక్షణమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



ఆ బకాయిలను సకాలంలో విడుదల చేయడం వల్ల రక్షణ శాఖ పరిధిలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, అవసరమైన పౌర సేవలు కొనసాగించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు లభిస్తుందని పొన్నం వివరించారు. ప్రజా వినియోగం కోసం కొన్ని రక్షణ భూములను ఇవ్వడానికి అంగీకరించినందుకు భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్న మంత్రి పొన్నం.. ఈ భూములను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాజ్‌నాథ్ సింగ్‌కు అందించిన వినతి పత్రంలో పొన్నం అభ్యర్థించారు.

## తెలంగాణకు అత్యంత
# అనుకూల పరిస్థితులున్నాయి

విలువలతో కూడిన వృద్ధికి కేరాఫ్‌గా తెలంగాణ స్టేట్ దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. పారిశ్రామికాభివృద్ధికి అత్యంత అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జీటో) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో హైటెక్స్, హెచ్‌ఐసీసీలలో మూడ్రోజులపాటు నిర్వహించనున్న 'జీటో కనెక్ట్ 2025'ను కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, కిషన్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒకప్పుడు పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాలిచ్చే రాయితీలు, ప్రోత్సాహకాలను చూసే పెట్టుబడులు పెట్టేవారన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇప్పుడు వారి ఆలోచన తీరు కూడా మారిందన్నారు. భవి




ష్యత్తు కోసం ఎదురుచూడకుండా, భవిష్యత్తునే తెలంగాణ నిర్మిస్తున్నదని అన్నారు. తెలంగాణ అవకాశాల ఖని అని, పరిశ్రమల ఏర్పాటుకు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అత్యంత అనుకూల పరిస్థితులున్నాయని వివరించారు. జైన సమాజం 'సేవా' స్ఫూర్తిని, తెలంగాణ ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్‌తో అనుసంధానిస్తే ప్రపంచం కోరుకుంటున్న నైతిక వృద్ధి నమూనా ఆవిష్కృతమవుతుందన్నారు.

# అందరం కలిసి ఉండాలనేదే 'అలయ్ బలయ్' ఉద్దేశం: వెంకయ్యానాయుడు

హైదరాబాద్: వేషభాషలు వేరయినా అందరం భారతీయులమనే భావనతో కలిసి ముందుకెళ్తున్నామని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు అన్నారు. హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులను దత్తాత్రేయ సత్కరించారు. అనంతరం ప్రముఖులు మాట్లాడారు. తొలుత వెంకయ్యానాయుడు మాట్లాడుతూ అందరం కలిసి ఉండాలనేది అలయ్ బలయ్ ఉద్దేశమన్నారు. 20 ఏళ్లుగా బండారు దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని కొనియాడారు. కొందరు కులం, మతం, వర్ణం, వర్గం, జాతి పేరుతో ప్రజల్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మన దేశంలో అలాంటి ఆశలు పెట్టుకున్నవారు నిరాశ చెందక తప్పదని చెప్పారు. చిన్నచిన్న విభేదాలు వచ్చినా



భారతీయులం అనే భావనతో అందరూ కలిసి వెళ్తుంటారన్నారు. ఈ కార్యక్రమంతో ఐక్యతా సందేశాన్ని అందించడం ముదావహమని పేర్కొంటూ దత్తాత్రేయ, విజయలక్ష్మిలకు వెంకయ్యానాయుడు అభినందనలు తెలిపారు.

* **ఇలాంటి కార్యక్రమాలు ఐక్యతకు ఉపయోగడతాయి: జస్టిస్ ఎన్వీ రమణ**

ఇలాంటి కార్యక్రమాలతో మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రజలకు తెలుస్తాయని



సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. అందర్నీ ఒక్కచోట చేర్చి ఐక్యత తెచ్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. సంప్రదాయాలకు అనుగుణంగా అలయ్ బలయ్ నిర్వహిస్తున్న దత్తాత్రేయ, విజయలక్ష్మిలకు ఆయన అభినందనలు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దత్తాత్రేయ అజాత శత్రువని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ప్రేమిస్తారని.. అందుకే పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున ఇక్కడికి వచ్చారని చెప్పారు.

# బిహార్ పర్యటనకు ఎన్నికల అధికారులు.. ఏ క్షణంలోనైనా షెడ్యూల్

బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు త్వరలో నగారా మోగనుంది. రాష్ట్రంలో ఎన్నికల సన్నద్ధతను పరిశీలించేందుకు శనివారం అధికారులు ఆ రాష్ట్ర పర్యటనకు వెళుతున్నారు. ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు వివేక్ జోషి, ఎస్ఎస్ సంధు శనివారం నుంచి రెండ్రోజుల పాటు పట్నాలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించేందుకు తగిన వాతావరణం ఉందా? లేదా? అనేది సమీక్షిస్తారు. ఎన్నికల అధికారుల పర్యటన పూర్తయ్యాక ఏ క్షణంలోనైనా బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంటుంది. 243 స్థానాలు కలిగిన బిహార్ అసెంబ్లీకి గడువు 2025 నవంబర్ 22తో ముగియనుంది. ఆ గడువులోగా కొత్త ప్రభుత్వం కొలువుదీరాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అక్టోబర్ నెలాఖరు, నవంబర్ నెలల్లో వివిధ దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. 2020లో మూడు విడతల్లో పోలింగ్ జరగ్గా.. 2015లో మాత్రం ఐదు విడతల్లో పోలింగ్ జరిగింది. ఎన్నికల అధికారులు తమ పర్యటనలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు, పోలీసు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే 425 మంది అబ్జర్వర్లను ఎన్నికల సంఘం నియమించింది. భాజపా జేడీయూ ఎల్జేపీతో కూడిన ఎన్డీయే కూటమి, ఆర్జేడీ కాంగ్రెస్‌తో కూడిన ఇండియా కూటమి మధ్య ఈ సారి గట్టి పోటీ ఉండనుంది. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. బిహార్‌తో పాటు దేశవ్యాప్తంగా 7 అసెంబ్లీ స్థానాలకూ ఉప ఎన్నికలు జరగనున్నాయి.




## ప్రపంచపటం నుంచి తుడిచేస్తాం జాగ్రత్త..
# పాక్‌కు ఆర్మీ చీఫ్ వార్నింగ్




ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోన్న పాకిస్థాన్‌కు భారత్ మరోసారి గట్టి హెచ్చరికలు చేసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని ఇకనైనా ఆపకపోతే.. దాయాది భౌగోళిక, చారిత్రక అస్థిత్వమే ప్రమాదంలో పడుతుందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది వార్నింగ్ ఇచ్చారు. రాజస్థాన్‌లోని అనూప్‌గఢ్‌లోని ఆర్మీ పోస్ట్‌ను సందర్శించిన ఆయన.. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ''ఆపరేషన్ సిందూర్ 1.0 సమయంలో మేం కాస్త సహనాన్ని ప్రదర్శించాం. కానీ, ఈసారి అలా జరగదు. పాక్ మళ్లీ రెచ్చగొడితే.. సిందూర్ 2.0 దెబ్బ తినాల్సిందే. భౌగోళిక చరిత్రలో ఉండాలనుకుంటారా? లేదా? అనేది ఆ దేశం ఆలోచించుకోవాలి. ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే చరిత్ర నుంచి తుడిచిపెట్టుకోవాల్సి వస్తుంది జాగ్రత్త'' అని ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అంతేగాక, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని సైనికులను ఆదేశించారు. భారత్‌కు పశ్చిమాన ఉన్న సర్ క్రీక్ ప్రాంతంలో దాయాది సైన్యం చురుగ్గా కార్యకలాపాలను సాగిస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత సైన్యం అప్రమత్తమై పాక్‌ను హెచ్చరిస్తోంది. నిన్న కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పొరుగు దేశానికి వార్నింగ్ ఇచ్చారు. పాక్ వక్రబుద్ధి చూపిస్తే.. చరిత్ర, భౌగోళిక పరిస్థితులు మారిపోవచ్చని అన్నారు.

# పీవోకేలో పాక్ అరాచకం.. తొలిసారి స్పందించిన భారత్

పాక్ ఆక్రమిత కశ్మీర్ లో అల్లర్లు హింసాత్మకంగా మారి 12 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై భారత ప్రభుత్వం తొలిసారి స్పందించింది. పాకిస్థాన్ అణచివేత విధానమే ఈ అశాంతికి దారితీసిందని విదేశాంగశాఖ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ''పాక్ ఆక్రమిత జమ్మూకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో జరుగుతోన్న నిరసనలు, అమాయక ప్రజలపై పాక్ బలగాల అరాచకత్వంపై పలు కథనాలు మా దృష్టికి వచ్చాయి. పీవోకేలో మానవహక్కుల ఉల్లంఘనపై దాయాదిని జవాబుదారీ చేయాలి'' అని అంతర్జాతీయ సమాజాన్ని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ కోరారు. ''పాక్ అణచివేత ధోరణితో పాటు ఆ ప్రాంతంలో వనరులను కొల్లగొట్టడమే ఈ అశాంతికి కారణమని మేం విశ్వసిస్తున్నాం'' అని దాయాదిని భారత్ నిందించింది. ఈ అల్లర్లకు భారత్ కారణమని పాక్ పరోక్షంగా వ్యాఖ్యలు చేసింది. మన శత్రుదేశానికి ఉపయోగపడేలా నిరసనలకు దిగొద్దని పాక్ మంత్రి అహ్సన్ ఇక్బాల్ అన్నారు.



ఆ దేశ ప్రభుత్వ అశక్తతను భారత్‌పై రుద్దాలని చూశారు. ఇదిలాఉంటే.. పీవోకే తమ దేశంలో అంతర్భాగమని భారత్ ఎప్పటికప్పుడు స్పష్టం చేస్తూనే ఉంది. ''కశ్మీర్ విషయంలో భారత్‌కు స్పష్టమైన వైఖరి ఉంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను అప్పగించడం మినహా మరో విషయం లేదు. అంతకుమించి మాట్లాడేది లేదు. ఉగ్రవాదుల అప్పగింతపై వాళ్లు మాట్లాడితే మేమూ మాట్లాడతాం. మరో మాట మాట్లాడే ఉద్దేశం మాకు లేదు. ఇందులో ఎవరి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదు. ఎవరూ మధ్యవర్తిత్వం వహించాల్సిన అవసరమూ లేదు'' అని ఆపరేషన్ సిందూర్ సమయంలో తేల్చిచెప్పింది. కాగా.. సెప్టెంబర్ 26 నుంచి అవామీ యాక్షన్ కమిటీ నేతృత్వంలో కొన్నిరోజులుగా పీవోకేలో నిరసనలు జరుగుతున్నాయి. పాక్ ప్రభుత్వం దశాబ్దాలుగా తమను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కుతోందని నిరసనకారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 70 ఏళ్లకుపైగా పీవోకేలోని ప్రజలకు ప్రాథమిక హక్కులు కూడా కల్పించలేదని వాపోయారు. పీవోకేలో మౌలిక సంస్కరణలు తీసుకురావాలని.. తమ 38 డిమాండ్లను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ''షటర్‌డౌన్.. వీల్‌జామ్'' పేరుతో అవామీ యాక్షన్ కమిటీ ఈ ఆందోళనలకు పిలుపునిచ్చింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తీవ్రమవుతుండడంతో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు భారీగా బలగాలను మోహరించింది. ఈ క్రమంలో కాల్పులకు తెగబడటంతో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 150 మంది వరకు గాయపడ్డారు.



## ముంచుకొస్తున్న 'శక్తి'..
# అరేబియా తీరంలో తుపాను ముప్పు

దేశ పశ్చిమ తీరంలో 'సైక్లోన్ శక్తి' ముంచుకొస్తోంది. ఈ ఏడాది అరేబియా సముద్రంలో తొలి తుపాను ఏర్పడనుందని భారత వాతావరణశాఖ శుక్రవారం వెల్లడించింది. ద్వారకకు నైరుతి దిశగా 240 కి.మీ , పోర్‌బందర్‌కు పశ్చిమం వైపు 270 కి.మీ దూరంలో అరేబియా సముద్రంలో ఈ అల్పపీడనం ఏర్పడింది. అది వాయుగుండంగా బలపడి గంటకు 12కి.మీ. వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. మరో మూడుగంటల్లో ఇది తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రానున్న 24 గంటల్లో తీవ్ర తుపానుగా మారవచ్చని అంచనా వేసింది. ఈ తుపానుకు 'శక్తి' అని పేరు పెట్టారు. ప్రపంచ వాతావరణ సంస్థ ఆదేశాల ప్రకారం హిందూ మహాసముద్రం తీరప్రాంతంగా కలిగిన 13 దేశాలు తుపాను పేర్లను నిర్ణయిస్తాయి. భారత్, బంగ్లాదేశ్, ఇరాన్, మాల్దీవులు, మియన్మార్, ఒమన్, పాకిస్థాన్, ఖతార్, సౌదీ అరేబియా, శ్రీలంక, థాయిలాండ్, యూఏఈ, యెమెన్ ఆ దేశాలు. కొన్ని తుపానుల ప్రభావం వారం కన్నా ఎక్కువ రోజులు ఉంటుంది. అదే సమయంలో మరో తుపాను వస్తే ఎలా అని ఆలోచించి వాటికి పేర్లు పెట్టడం ప్రారంభించారు. ఈ సారి శక్తిపేరును శ్రీలంక పెట్టింది. ఒక్కో తుపానుకు ఒక్కో పేరు పెడితే డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు, మీడియాకు, సాధారణ ప్రజలకు ఇది ఫలానా తుపాను అని గుర్తుండిపోతుంది. అంతేకాకుండా ఆ పేరుతో ప్రజలను అప్రమత్తం చేసే అవకాశం ఉంటుంది. ఈ పేర్లు వీలయినంత చిన్నగా.. సులభంగా పలికే విధంగా ఉండాలనే నిబంధన ఉంది.

**ఎవరు నిర్ణయిస్తారంటే..?**

ప్రపంచ వ్యాప్తంగా ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాలు, నాలుగు ప్రాంతీయ ఉష్ణమండల తుపాను హెచ్చరిక కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాలు తుపానుల గురించి సలహాలు, సమాచారం ఇస్తుంటాయి. అలాగే వాటికి పేర్లు పెడుతుంటాయి. ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాల్లో భారత వాతావరణశాఖ ఒకటిగా పనిచేస్తోంది. ఇది ఉత్తర హిందూ మహా సముద్రంపై గరిష్ఠంగా గంటకు 60 కిలోమీటర్ల ఉపరితల వేగంతో గాలులు వీచే తుపాన్లకు పేర్లు పెడుతుంది. అక్షర క్రమం ఆధారంగా ఒక్కో దేశం ఓ తుపానుకు పేరును సూచిస్తుంది. ప్రతి సారి ఆ పేరు కొత్తగా.. మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలి. పేరు 8 అక్షరాలకు మించరాదు. అది ఏ సభ్య దేశానికీ అభ్యంతరకరంగా ఉండకూడదు. ఏ వర్గం ప్రజల మనోభావాలను దెబ్బతీయకూడదు.

## బైక్‌ల కంటే కార్లకు బరువు ఎందుకు..?
# రాహుల్ వివరణపై భాజపా వ్యంగ్యాస్త్రాలు

కొలంబియా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వేసిన ఓ ప్రశ్నపై భాజపా వ్యంగ్యాస్త్రాలు విసిరింది. కారు బరువు 3000 కేజీలు ఉంటే.. బైక్ బరువు 100 కేజీలే ఎందుకు ఉంటుందని విద్యార్థులతో మాట్లాడుతూ రాహుల్ వివరణ ఇచ్చారు. ఇదేం అర్థంలేని ప్రసంగమంటూ కమలం పార్టీ నేత అమిత్ మాలవీయ ఎక్స్ వేదికగా విమర్శలు చేశారు. ఇంతకీ కాంగ్రెస్ ఎంపీ ఏం మాట్లాడారంటే..? ''ఒక వ్యక్తిని తీసుకెళ్లే కారుకు 3000 కేజీల మెటల్ అవసరం. అదే 100 కేజీల మోటార్ సైకిల్‌పై ఇద్దరు ప్రయాణించవచ్చు. 150 కేజీల మెటల్‌తో తయారైన బైక్ ఇద్దరిని ఎలా తీసుకెళ్తుంది..? కారుకు అంత లోహం ఎందుకు అవసరమవుతోంది..?'' అని



విద్యార్థులతో రాహుల్ మాట్లాడారు. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పే ప్రయత్నం చేశారు. ''మోటార్ సైకిల్ ప్రమాదానికి గురైనప్పుడు ఇంజిన్ వేరవుతుంది. దానివల్ల మీకు ఎలాంటి ప్రమాదం జరగదు. కారుకు ప్రమాదం జరిగినప్పుడు ఇంజిన్ కారులోపలికి వెళ్తుంది. కాబట్టి, మీకు ప్రమాదం జరగకుండా ఇంజిన్‌ను అడ్డుకునేలా కారును డిజైన్ చేస్తారు. ఈ కారు సమస్యకు ఎలక్ట్రిక్ మొబిలిటీనే పరిష్కారం చూపిస్తుంది. అది సెంట్రలైజ్డ్ ఎనర్జీ సిస్టమ్‌ను విచ్ఛిన్నం చేస్తుంది'' అని రాహుల్ ప్రసంగించారు. దీనిపై భాజపా (BJP) నేత అమిత్ మాలవీయ ఎక్స్ వేదికగా స్పందించారు. ''నేను గతంలో ఎన్నడూ ఇలాంటి అర్థంలేని మాటలు వినలేదు. అసలు రాహుల్ గాంధీ ఏం చెప్పాలనుకున్నారో ఎవరైనా డీకోడ్ చేయగలరా..? చెప్తే నేను సంతోషిస్తాను. లేకపోతే మీకూ నాలాంటి పరిస్థితే ఉందా?'' అని వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు.

# ఆ దగ్గుమందులో కలుషిత ఆనవాళ్లు లేవు: ఔషధ నియంత్రణ సంస్థ

పెద్దలకు వాడే దగ్గు సిరప్‌ను ఇవ్వడంతో రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో 11మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోగా పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటి వరకు తాము నిర్వహించిన పరీక్షల్లో పిల్లలకు ఇచ్చిన దగ్గుమందులో ఎటువంటి కలుషిత ఆనవాళ్లు లేవని ఔషధ నియంత్రణ సంస్థకు చెందిన అధికారిక వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనరిక్ దగ్గు సిరప్‌ను సరఫరా చేస్తారని.. దానిపై తాము తాజాగా పరీక్షలు నిర్వహించామని తెలిపాయి. పెద్దలకు వాడే దగ్గు సిరప్‌తో 11మంది పిల్లలు ప్రాణాలు కోల్పోవడంతో ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ సిరప్‌ను జైపుర్‌కు చెందిన ఔషధ సంస్థ తయారు చేస్తోంది. గత రెండేళ్లుగా ఈ సిరప్‌నకు చేసిన నాణ్యతా పరీక్షల్లో 40 నమూనాలు విఫలమయినట్లు గుర్తించిన అధికారులు తాత్కాలికంగా నిషేధం విధించారు. ఇప్పటి వరకు సదరు ఔషధ సంస్థ 660 బాటిళ్లను తయారు చేయగా 594 బాటిళ్లను వివిధ దుకాణాలకు సరఫరా చేసినట్లు తెలుస్తోంది. సంస్థలో ఉన్న 66బాటిల్ శాంపుల్స్‌ను అధికారులు పరీక్షిస్తున్నారు. ఈ సిరప్ బాటిళ్లను అమ్మకూడదని దుకాణదారులకు సూచించారు. కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్న పిల్లలు ఈ సిరప్ తీసుకోవడం వల్ల మరింత ప్రభావం పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. అయితే ఈ సిరప్ సురక్షితమని నిరూపించడానికి దానిని తీసుకున్న భరత్‌పుర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని



ఒక వైద్యుడు కూడా అనారోగ్యానికి గురయినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం అతడికి చికిత్స అందిస్తున్నామన్నారు. ఈ మరణాలకు మరేదైనా కారణముందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## చిరిగిన రికార్డులు..
# 32 ఏళ్ల నాటి కేసులో నిర్దోషులుగా తేలిన ఐదుగురు

ఓ కేసుకు సంబంధించిన రికార్డులు చిరిగిపోవడంతో ఐదుగురు నిందితులను ఓ సెషన్స్ కోర్టు నిర్దోషులుగా తేల్చింది. 32 ఏళ్ల క్రితం జరిగిన హత్య కేసులో పత్రాలు కన్పించకపోవడంతో పాటు సరైన సాక్ష్యాలు సమర్పించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని ఈసందర్భంగా మహారాష్ట్రలోని థానే కోర్టు పేర్కొంది. 1992లో సామ్రాట్ అశోక్‌నగర్‌లో లక్కీ ప్రేమ్‌చంద్ భాటియా అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. దీనికి సంబంధించి ఐదుగురు వ్యక్తులను నాడు పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఈ కేసు విచారణలో తీవ్ర జాప్యం జరిగింది. ఈనేపథ్యంలో నిందితులకి బెయిల్ మంజూరైంది. ఆ తర్వాత వారి ఆచూకీ తెలియకపోవడంతో కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఇక, తాజాగా కల్యాణ్‌లోని అదనపు సెషన్స్‌జడ్జి పి.ఎఫ్.సయ్యద్ ఈ కేసును విచారించారు. కేసుకు సంబంధించి ఛార్జ్‌షీట్, సాక్షుల వాంగ్మూలాలు సహా కీలకపత్రాలు చిరిగిపోయాయని న్యాయమూర్తి పేర్కొన్నారు.

# కరూర్ తొక్కిసలాట ఘటన: సిట్ విచారణకు మద్రాస్ హైకోర్టు ఆదేశం

చెన్నై: తమిళనాడులోని కరూర్‌లో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనపై మద్రాస్ హైకోర్టు సిట్ విచారణకు ఆదేశించింది. ఐజీ అస్రాగార్గ్ నేతృత్వంలో సిట్ దర్యాప్తునకు ఆదేశాలు ఇచ్చింది. ఈ తొక్కిసలాట ఘటన కేసు ఎఫ్ఐఆర్‌లో టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ పేరును ఎందుకు చేర్చలేదనే రిట్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఘటన జరిగిన తర్వాత టీవీకే నేతలందరూ అక్కడి నుంచి వెళ్లిపోవడాన్ని మద్రాస్ హైకోర్టు తప్పుపట్టింది. ప్రమాదాన్ని పట్టించుకోకుండా పార్టీ నేతలందరూ అక్కడి నుంచి వెళ్లిపోవడం వాళ్ల ఆలోచనా ధోరణిని తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. 41మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం విజయ్ పట్ల ఉదాసీనత ప్రదర్శిస్తోందని మండిపడింది. కరూర్‌లో ఏం జరిగిందో ప్రపంచమంతా చూసిందని పేర్కొంది. ఎక్కువ సంఖ్యలో వచ్చే ప్రజల



కోసం తగిన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత లేదా అని ధర్మాసనం.. కార్యక్రమ నిర్వాహకులు, పోలీసులను ప్రశ్నించింది. ఇంత జరిగిన తర్వాత కూడా మేం కళ్లు మూసుకోలేమని ఘాటు వ్యాఖ్యలు చేసింది. టీవీకే నాయకులు బుస్సీ ఆనంద్, సీటీఆర్ నిర్మల్ కుమార్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై ఆదేశాలను రిజర్వ్ చేసినట్లు జస్టిస్ సెంథిల్ కుమార్ తెలిపారు. ఈ ఘటనపై శుక్రవారం ఉదయం కూడా విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు సీబీఐ దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ వేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. విజయ్ వేసిన పిటిషన్‌పై ఆగ్రహం వ్యక్తంచేసింది. కరూర్ ఘటనపై పోలీసుల దర్యాప్తు ఇంకా ప్రారంభదశలోనే ఉన్న విషయాన్ని గుర్తుచేసింది. ఈ క్రమంలోనే సీబీఐ దర్యాప్తు కోరడం సరికాదని పేర్కొంది. ఈ సందర్భంగా కోర్టులను రాజకీయ వేదికలుగా మార్చవద్దని వ్యాఖ్యానించింది. సీబీఐ దర్యాప్తు కోరుతూ భాజపా న్యాయవాది జీఎస్ మణి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కొట్టివేసింది. ఇక, విచారణ సందర్భంగా రాజకీయ పార్టీలకు కోర్టు కీలక సూచనలు చేసింది. భవిష్యత్తులో నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, అంబులెన్స్ సేవలు, నిష్క్రమణ మార్గాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని పేర్కొంది.



## మన శంకర వరప్రసాద్‌గారులో ఉదిత్ నారాయణ్ పాట

**టాకీస్:** కమర్షియల్ హంగులతో చక్కటి వినోదాన్ని పంచే దర్శకుడు అనిల్ రావిపూడి కొత్త పంథాను అనుసరిస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా వెంకటేశ్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' తీసి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్నారు. ఇక ఇందులోని 'గోదారి గట్టుమీద' పాటను రమణ గోగులతో పాడించి నేటి యువతరాన్ని సైతం కట్టిపడేశారు. ఇప్పుడు అలనాటి క్రేజీ గాయకుడు ఉదిత్ నారాయణ్‌తో మేజిక్ క్రియేట్ చేసేందుకు అనిల్ రావిపూడి సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. నయనతార కథానాయిక. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా సినిమాను తీసుకొచ్చేందుకు ముస్తాబు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఉదిత్ నారాయణ్‌తో ఓ పాట పాడిస్తున్నారు. 90 దశకం చివరిలో 2000 సంవత్సరం తర్వాత వచ్చిన తెలుగు సహా ఇతర భాషల్లో ఉదిత్ నారాయణ్ స్వరం శ్రోతలను ఓ ఊపు ఊపేసింది. మరీ ముఖ్యంగా తెలుగులో ఆయన పాటలకు విశేషమైన క్రేజ్ ఉండేది. చిరంజీవి నటించిన చిత్రాల్లోని 'రామ్మా చిలకమ్మా..', 'కైకలూరి కన్నె పిల్ల..', 'వానా వానా వెన్నెల వానా...' వంటి పాటలను ఉదిత్ నారాయణ్ ఆలపించారు. అవి ఎవర్‌గ్రీన్‌గా నిలిచాయి. ఇప్పుడు మరోసారి 'మీసాల పిల్ల' అంటూ తన స్వరంతో అలరించబోతున్నారు. దీనికి చిరంజీవి డ్యాన్స్, గ్రేస్ తోడైతే వెండితెరపైన నిజంగా సంక్రాంతి సందడే.

## నానితో సినిమాకు క్లాప్ కొట్టిన ఓజీ దర్శకుడు సుజిత్



**టాకీస్:** ఓజి విడుదల కాక ముందే నాని హీరోగా దర్శకుడు సుజీత్ ఓ సినిమా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఏడాది దాటినా మరో అప్‌డేట్ లేకపోవడంతో ఈ చిత్రం క్యాన్సిల్ అయిందనే రూమర్స్ ఇటీవల వచ్చాయి. 'ఓజీ' ప్రమోషన్స్‌లోనే సుజీత్ వాటికి చెక్ పెట్టారు. నానితో సినిమా ఉంటుందని స్పష్టం చేశారు. తాజాగా ఈ చిత్రాన్ని ప్రారంభించారు. దసరాని పురస్కరించుకుని ఈ సినిమాని లాంఛనంగా హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ వేడుకకు హీరో వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై, ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సంబంధిత ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. సినిమాలోనూ కలిసి నటిస్తున్నారా? అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుందని, మరిన్ని అప్‌డేట్స్ రాబోతున్నాయని నిర్మాత వెంకట్ బోయనపల్లి తెలిపారు. సుజీత్ 'ఓజీ' విజయాన్ని ఆస్వాదిస్తుండగా.. నాని 'ది ప్యారడైజ్'లో నటిస్తున్నారు. 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రమిది. నానితో చేయబోయే సినిమా 'ఓజీ' యూనివర్స్‌లోకి వస్తుందా? అన్న ప్రశ్నకు ఇటీవల సుజీత్ సమాధానమిచ్చారు. తన తొలి సినిమా 'రన్ రాజా రన్' స్టైల్‌లో ఉంటుందని, 'ఓజీ' యూనివర్స్‌లో భాగం కాదని తెలిపారు. ఈ చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. కానీ, అధికారిక ప్రకటన లేదు.

## బంపర్ ఆఫర్ కొట్టేసిన క్రేజీ బ్యూటీ..



టాకీస్: స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ఇటీవలే లక్కీ భాస్కర్ సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయికగా నటించింది. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ సినిమా మంచి వసూళ్లు రాబట్టింది. గతేడాది దీపావళి కానుకగా అక్టోబర్ 31న థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు జీవీ ప్రకాష్ సంగీతం అందించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. ఈ సినిమా పాన్ ఇండియాలో సూపర్ డూపర్ హిట్ అయింది. 2012లో విడుదలైన 'సెకండ్ షో' చిత్రంతో దుల్కర్ తన నట జీవితాన్ని ప్రారంభించాడు. ఆ తర్వాత విడుదలైన 'ఉస్తాద్ హోటల్' సినిమా అభిమానుల మదిలో చెరగని స్థానాన్ని సంపాదించుకుంది. ఇక తెలుగులోకి ఒకే బంగారం సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించాడు. ఈ సినిమా తెలుగులో మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత దుల్కర్ నటించిన సినిమాలు తెలుగులోనూ విడుదలై మంచి విజయాలను అందుకుంది. దుల్కర్ సల్మాన్ మళ్లీ తెలుగు దర్శకుడితో పని చేస్తున్నారని తెలుస్తుంది. టాలీవుడ్ డైరెక్టర్ పవన్ సాదినేని దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు దుల్కర్. ఈ సినిమాకు ఆకాశంలో ఓ తార అనే టైటిల్ ను ఖరారు చేశారు. ఈ సినిమాలో హీరోయిన్ గా అందాల భామ రుహానీ శర్మ నటిస్తుందని తెలుస్తుంది. తెలుగులో చిలసౌ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించింది ఈ ముద్దుగుమ్మ. మొదటి సినిమాతోనే తెలుగు కుర్రాళ్ల హృదయాలను దోచేసింది హీరోయిన్ రుహానీ శర్మ. చిలసౌ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ అమ్మడు ఆ తర్వాత సరైన క్రేజ్ మాత్రం సొంతం చేసుకోలేదు. టాలీవుడ్ ఇండస్ట్రీలో అడపాదడపా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ఈ బ్యూటీ.. ఇప్పుడు దుల్కర్ సినిమాలో ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది. త్వరలోనే దీని పై క్లారిటీ రానుంది. ఈ వార్తల్లో నిజం ఉంటే రుహానీ శర్మ రేంజ్ మారిపోయినట్టే అంటున్నారు అభిమానులు.

## జాతీయ అవార్డులపై విమర్శలు సరికాదు: రాణిముఖర్జీ

**టాకీస్:** ఇటీవల మొదటిసారి నేషనల్ అవార్డును అందుకున్న బాలీవుడ్ నటి రాణీ ముఖర్జీ ,జాతీయ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. ఆ పురస్కారాలు ప్రకటించినప్పుడు కొన్నిసార్లు వచ్చే విమర్శలపై స్పందించారు. అవార్డులు ప్రకటించినప్పుడు ఎవరైనా ప్రశ్నిస్తే వాటి విలువ తగ్గిపోతుందన్నారు. 'దేశవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకోవడం ఆనందంగా ఉంది. మనకు నేషనల్ అవార్డు ప్రకటించినప్పుడు ప్రేక్షకులు కూడా మనం దానికి అర్హులమని భావిస్తే వచ్చే సంతోషం మాటల్లో చెప్పలేం. అలా కాకుండా 'ఆమె నటనకు పురస్కారం వచ్చిందా?. ఆమె కంటే గొప్పవారు చాలామంది ఉన్నారు' అని కామెంట్స్ వినిపించాయంటే దాన్ని అందుకున్నప్పటికీ విలువ ఉండదు. తాజాగా నాకు జాతీయ పురస్కారం వచ్చినప్పుడు అందరూ అంగీకరించారు. వారి అంగీకారం నాకు అవార్డు కంటే గొప్పగా అనిపించింది. నటీనటులకు చిన్న పురస్కారం కూడా ముఖ్యమే. ప్రేక్షకులను అలరించడమే మా ప్రధాన ఉద్దేశం. మాకు గౌరవం, గుర్తింపు వచ్చాయంటే అభిమానులు కూడా ఆనందిస్తారు' అని రాణి చెప్పారు. 2023లో విడుదలైన 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' సినిమాకు గాను రాణీ ముఖర్జీ ఉత్తమ నటిగా జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు.



## ఆనాడు ఒక్క షో ప్రదర్శన కోసం కష్టపడ్డా

### కాంతారా విజయం మర్చిపోలేనిదన్న రిషబ్ శెట్టి

**టాకీస్:** రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంతార చాప్టర్ 1' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఆయన గత రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 2016లో తన సినిమాను ఒక్క షో ప్రదర్శించడం కోసం ఎంతో కష్టపడినట్లు చెప్పారు. ఈరోజు తనకు దక్కుతున్న గౌరవం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. 2016లో నా చిత్రం సాయంకాలం షో ప్రదర్శించడం కోసం పడిన కష్టం నుంచి 2025లో 5000కు పైగా థియేటర్స్‌లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించే వరకూ ఇదీ.. దర్శకుడిగా నా జర్నీ. ఈ సినీ



ప్రయాణం దేవుడి దయతో పాటు మీ ప్రేమాభిమానాలను ఎప్పటికీ మర్చిపోలేను. మీ ఆదరణతోనే ఈ విజయం సాధ్యమైంది. నన్ను ఆదరించిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతల అంటూ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 2012లో 'తుగ్లక్' అనే సినిమాతో తన కెరీర్ ప్రారంభించిన రిషబ్ శెట్టి నటుడిగా, దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. మొదటిసారి 2016లో 'రిక్కీ' అనే సినిమాకు దర్శకత్వం వహించారు. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఆ సినిమా పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. 2022లో ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంతార'కు జాతీయస్థాయిలో గొప్ప గుర్తింపు వచ్చింది. చిన్న సినిమాగా విడుదలై బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకొని అవార్డులు తెచ్చింది. ఇప్పుడు దీని ప్రీక్వెల్‌గా వచ్చిన 'కాంతార చాప్టర్ 1'కూడా అదేస్థాయిలో ఆదరణ సొంతం చేసుకుంటోన్న విషయం తెలిసిందే.

## రాజు గారి గది 4 కూడా వచ్చేస్తోంది..

### ఆరేళ్ల గ్యాప్ తరువాత ఓంకార్ ప్రకటన



టాకీస్: తెలుగు ప్రేక్షకుల్ని భయపెట్టిన హారర్ ఫ్రాంచైజీ 'రాజు గారి గది' ఇప్పుడు మళ్లీ మెరుపులు మెరిపించేందుకు సిద్ధమవుతోంది. యాంకర్-డైరెక్టర్ ఓంకార్ ఆరేళ్ల గ్యాప్ తర్వాత ఈ సిరీస్‌లో నాలుగో భాగాన్ని ప్రకటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రం పేరు రాజు గారి గది 4: శ్రీచక్రం. తాజాగా విడుదలైన ఫస్ట్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో కాళికా మాత ఉగ్రరూపంలో దర్శనం ఇవ్వగా, ఎర్రచీరలో ఉన్న ఓ మహిళ దేవీ వైపు నడుచుకుంటూ వెళుతుండటం హారర్, మిస్టికల్ ఎలిమెంట్స్‌ను సూచిస్తోంది. పోస్టర్‌కు జత చేసిన ట్యాగ్ లైన్ ఆసక్తి రేపుతుంది. ఈసారి కథా నేపథ్యం పూర్తిగా భక్తి, భయాల మిశ్రమంగా ఉండనుంది. 'కాళికాపురం' అనే ఊరిలోని కాళికా మాత ఆలయం, శ్రీచక్రం మహిమ, భక్తి వల్ల మేల్కొనే అమ్మవారు వంటి అంశాలతో హారర్, థ్రిల్లర్, కామెడీని మిక్స్ చేస్తూ ఓ కొత్త డైవైన్ యూనివర్స్‌ను నిర్మించనున్నట్టు చిత్రబృందం వెల్లడించింది. రాజు గారి గది హిట్ కావడంతో దానికి సీక్వెల్స్ చేస్తూ వస్తున్నారు ఓంకార్. ఇప్పటికే రాజు గారి గది2, రాజు గారి గది3 చిత్రాలు హిట్ కావడంతో రాజు గారి గది4 కు శ్రీకారం చుట్టారు. 'రాజు గారి గది 4: శ్రీచక్రం' సినిమా 2026 దసరా సందర్భంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రారంభ దశలో ఉన్న స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన తర్వాత షూటింగ్ మొదలవుతుంది. 2015లో వచ్చిన 'రాజు గారి గది' బాక్సాఫీస్ దగ్గర విజయాన్ని నమోదు చేయగా, 2017లో 'రాజు గారి గది 2', 2019లో 'రాజు గారి గది 3' ప్రేక్షకులను అంతగా అలరించకలేకపోయాయి. అందుకే ఓంకార్ గ్యాప్ తీసుకుని మళ్లీ ఈ కొత్త కాన్సెప్ట్‌తో తిరిగి వస్తున్నారు. భక్తి, హారర్, థ్రిల్లర్ మేళవింపుతో 'శ్రీచక్రం' కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుంది. క్యాస్టింగ్‌కి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.